క్లుప్తంగా

వేతన బోర్డు సభ్యుడిగా రాజు



మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌ను సన్మానిస్తున్న రాజు

పటాన్‌చెరు టౌన్‌: తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్‌ బోర్డు మెంబర్‌ గా పటాన్‌చెరుకు చెందిన రాజు ముదిరాజ్‌ నియమితులయ్యారు. నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌ ను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. సీఎం రేవంత్‌ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌తో పాటు కాంగ్రెస్‌ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు. కార్మికులకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో సువిన్‌ యూనియన్‌ ట్రెజరీ సత్యనారాయణ రెడ్డి, జాయింట్‌ సెక్రటరీ ప్రవీణ్‌, సలహాదారులు ప్రవీణ్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

జహీరాబాద్‌ టౌన్‌: సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే రెగ్యులర్‌ చేయాలని శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సీఆర్‌పీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నామని, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్‌ చేయాలని, మినిమం టైం స్కేల్‌ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు సంగమేశ్వర్‌, ప్రశాంత్‌, అశోక్‌, వేణు, విజయ్‌, విమల, లక్ష్మి, తుక్కమ్మలు పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు రండి



కవితతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

నారాయణఖేడ్‌: మల్లన్నస్వామి కల్యాణమహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌ రెడ్డి ఆహ్వానించారు. మండలంలోని అనంతసాగర్‌లో ఈనెల 15న నిర్వహించే జాతర ఉత్సవాలకు రావాలని బీఆర్‌ఎస్‌ ఖేడ్‌ మండలాధ్యక్షులు పరమేశ్వర్‌, అనంతసాగర్‌ మాజీ సర్పంచ్‌ సిద్ధుతో కలిసి ఆయన ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆరోజు ఉదయం 11గంటలకు ఆమె రాబోన్నట్లు తెలిపారని భూపాల్‌రెడ్డి చెప్పారు.

సీఎం కప్‌ పోటీలు విజయవంతం



బహుమతులు పొందిన విద్యార్థులతో అధికారులు

నారాయణఖేడ్‌: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఖేడ్‌ తహసీల్‌ గ్రౌండ్‌లో మూడురోజులపాటు నిర్వహించిన సీఎం కప్‌ క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌ స్వరూప్‌ షెట్కార్‌, వైస్‌ చైర్మన్‌ దారం శంకర్‌, ఆర్డీఓ అశోక చక్రవర్తి, మున్సిపల్‌ కమిషనర్‌ జగ్జీవన్‌ తదితరులు బహుమతులు అందజేశారు. పోటీలను విజయవంతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించిన పీఈటీలను శాలువాలతో సన్మానించారు.

తపస్‌ మండల కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు కృష్ణ



కార్యదర్శి రాము

న్యాల్‌కల్‌ (జహీరాబాద్‌): న్యాల్‌కల్‌ మండల తపస్‌ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక్కడ పని చేసిన అధ్యక్ష, కార్యదర్శులు ఇటీవల నిర్వహించిన బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వారి స్థానంలో నూతన అధ్యక్షులుగా మామిడ్గి పాఠశాలలో పనిచేస్తున్న కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా న్యాల్‌కల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తపస్‌ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి తెలిపారు.

● నిర్లక్ష్యం.. నిలువుటద్దం



హనుమాన్‌ నగర్‌ పల్లె ప్రకృతి వనంలో చిందరవందరగా పడేసిన మొక్కలు

సంగారెడ్డి మండలం హనుమాన్‌ నగర్లోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలన్నీ వాడిపోయాయి. నర్సరీలో సైతం మొక్కలు ఇష్టం వచ్చినట్లుగా పడేశారు. సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. ఈ విషయమై అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సంగారెడ్డి టౌన్‌

● విజ్ఞానం.. వైవిధ్యం



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పటాన్‌చెరు సెయింట్‌ జోసఫ్‌ పాఠశాలలో రెండు రోజులుగా విజ్ఞాన ప్రదర్శన కొనసాగుతోంది. పటాన్‌చెరు, ఇస్నాపూర్‌, ఇంద్రేశం, బీరంగూడ, బీహెచ్‌ఈఎల్‌, రామచంద్రాపురం, మదీనాగూడ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలను తిలకిస్తున్నారు. పలు ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యఅతిథిగా ఫాదర్‌ అంబరోజ్‌ హాజరై తిలకించారు.

– పటాన్‌చెరు టౌన్‌

పంట మార్పిడి తప్పనిసరి

జహీరాబాద్‌: రైతులు విధిగా పంట మార్పిడి, తట్టుకునే రకాలను మాత్రమే వేసుకోవాలని డీడీఎస్‌–కేవీకే భూసార పరీక్షల నిపుణుడు ఈ స్వామి, ఏఈఓ ప్రదీప్‌కుమార్‌లు అన్నారు. మండలంలోని రంజోల్‌, హుగ్గెల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో రైతులకు భూసార పరీక్షల ఫలితాల సర్టిఫికెట్లు అందజేశారు. మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా తమ పొలాల్లో పోషకాల స్థితి, ఉదజని సూచిక, సేంద్రియ కర్బన పరిస్థితుల గురించి రైతులకు తెలిపారు. పంటలకు అవసరమైన మేరకే ఎరువులు వేసుకోవాలని సూచించారు. రైతులు విధిగా పంట మార్పిడి చేయాలని, పలు రకాలను మాత్రమే వేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి యూనివర్శిటీ విద్యార్థినులు, రైతులు సంజీవరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌, కృష్ణకాంత్‌, పాపన్న, అంజన్న, మొయిజ్‌, మోహన్‌, నర్సింహారెడ్డి, పరశురాం, గోపాల్‌ పాల్గొన్నారు.

పశువుల సంత.. సమస్యల చింత

జిల్లాలోనే అతి పెద్ద పశువుల సంతలో సమస్యలు తిష్టవేశాయి. పశువుల క్రయవిక్రయాల ద్వారా మార్కెట్‌ కమిటీకి ఆదాయం సమకూరుతున్నా మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన పాలక మండలి కూడా వీటిపై దృష్టి పెట్టడం లేదు. ముక్కుపిండి పన్ను వసూలు చేస్తూ వసతులు ఎందుకు కల్పించడం లేదని రైతులు, వ్యాపారులు నిలదీస్తున్నారు.

- మూగజీవాలకు నీటి కొరత
- దెబ్బతిన్న నీటి తొట్టెలు
- ప్లాట్‌ ఫాంల సంగతి సరేసరి
- రైతులకు విశ్రాంతి షెడ్ల నిర్మాణాలేవి?
- మార్కెట్‌కు ఆదాయం ఉన్నా.. పట్టించుకోని అధికారులు



జహీరాబాద్‌ సంతకు వచ్చిన పశువులు



అసంపూర్తిగా ఉన్న విశ్రాంతి భవనం

జహీరాబాద్‌ టౌన్‌: జిల్లాలో జహీరాబాద్‌ పశువుల సంత ఎంతో పేరుంది. ప్రథమ శ్రేణి అర్హత కలిగిన మార్కెట్‌ సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రతీ శుక్రవారం జరిగే సంతకు జిల్లాతో పాటు పక్కనున్న కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి రైతులు, దళారులు, వ్యాపారులు వస్తారు. పశువుల క్రయవిక్రయాల ద్వారా ప్రతీ వారం మార్కెట్‌ కమిటీకి రూ. 50 వేలకు పైగానే ఆదాయం వస్తుంది. కానీ అంగడిలో కనీస వసతులు కల్పించడం లేదు. పెద్ద సంఖ్యలో సంతకు వస్తున్న పశువులకు నీడ కూడా లేదు. మూగజీవాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నారు. పశువులకు తాగేందుకు సరిపడా నీరు లేదు. నీటి తొట్టెలు లేక నీరు నిల్వ చేయలేకపోతున్నారు. కొన్ని నీటి తొట్టీలు దెబ్బతిని నిరుపయోగంగా మారాయి. పశువుల దాహార్తి తీర్చేందుకు రైతులు, వ్యాపారులు తిప్పలు పడుతున్నారు. వారికి కూడా గొంతు తడుపుకొనేందుకు తాగునీటి సౌకర్యం లేదు. పక్కనున్న హోటళ్లను ఆశ్రయిస్తున్నారు. పశువులను లారీలో ఎక్కించడానికి నిర్మించిన ప్లాట్‌ ఫాంలు దెబ్బతిన్నాయి. వాటికి కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. ప్రహరీ కూడా పూర్తిగా దెబ్బతింది, మరమ్మతులు మాత్రం చేయడం లేదు.

అసంపూర్తిగా విశ్రాంతి గదులు

రైతుల విశ్రాంతి కోసం నిర్మించిన షెడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే దళారులు, వ్యాపారులు, రైతులు సంతకు ఒక రోజు ముందుగానే ఇక్కడి వస్తుంటారు. వారి కోసం రెండు దశాబ్దాల క్రితం షెడ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. పిల్లర్‌ దశలోనే విశ్రాంతి గదుల పనులు ఆగిపోయాయి. పశువుల మధ్యలోనే రైతులు నిద్రపోతున్న పరిస్థితి ఇక్కడ నెలకొంది. కొత్తగా ఏర్పడిన పాల మండలి కూడా పశువుల సంతపై శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైన సమస్యలను పరిష్కరించి పశువుల సంతకు పూర్వవైభవం తీసుకు రావాలని రైతులు కోరుతున్నారు.

ఆ ఇళ్లు స్థానికులకు కేటాయించండి

● ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి



బల్దియా కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు పడకగదుల ఇళ్లలో లబ్ధిదారులకు కేటాయించని ఇళ్లను స్థానికులకు కేటాయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి కోరారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబరితికి ఆయన వినతి పత్రం సమర్పించారు. పటాన్‌చెరు మూడో డివిజన్‌ పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌తో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన 40 వేల డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లలో ఖాళీగా ఉన్న గృహాలను స్థానికులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొద్దిమంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను కేటాయించారని, అర్హత కలిగిన లబ్ధిదారులు వేల సంఖ్యలో ఉన్నారని కమిషనర్‌ దృష్టికి తీసుకెళ్లారు. భారతీనగర్‌, రామచంద్రాపురం, పటాన్‌చెరు డివిజన్‌ల పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల కొరత మూలంగా శానిటేషన్‌ పూర్తిస్థాయిలో జరగడం లేదని తెలిపారు. చనిపోయిన కార్మికుల స్థానాల్లో నూతన కార్మికులను నియమించాలని, అర్హత లేకున్నా సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్న కార్మికులపై చర్యలు తీసుకోవాలని, సర్కిల్‌ పరిధిలో నూతన జేసీబీని ఏర్పాటు చేయాలని కోరారు. పేద ప్రజల అవసరాల కోసం నిర్మించిన మల్టీపర్పస్‌ ఫంక్షన్‌ హాల్‌ నిర్వహణ అధ్వానంగా తయారయిందని తెలిపారు.

పారదర్శకత కోసమే తనిఖీలు



సామాజిక తనిఖీ చేస్తున్న అడిషనల్‌ పీడీ బాలరాజ్‌

● అడిషనల్‌ పీడీ బాలరాజ్‌

కల్హేర్‌(నారాయణఖేడ్‌): ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు పారదర్శకంగా ఉండేందుకు, లొసుగులు సవరించేందుకు సామాజిక తనిఖీ చేస్తున్నామని డీఆర్‌డీఓ అడిషనల్‌ పీడీ బాలరాజ్‌ తెలిపారు. శుక్రవారం కల్హేర్‌లో ఉపాధి 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరిగింది. డీఆర్‌పీలు తనిఖీ నివేదికను చదివి వినిపించారు. సిబ్బందికి సలహాలు, సూచనలను పీడీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ విజిలెన్స్‌ అధికారి నాగేశ్వర్‌రావు, క్వాలిటీ కంట్రోల్‌ అధికారి శ్రీలత, ఎంపీడీఓ రమేశ్‌ బాబు, స్టేట్‌ ఎస్‌ఆర్‌పీ అంజాగౌడ్‌, ఎస్‌ఆర్‌పీ మహేశ్‌, ఏపీఓలు శ్యామ్‌, నర్సింహులు, ఇంజనీరింగ్‌ కన్సల్టెంట్‌ వేణుమాధవ్‌, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం పరిశీలన



సీసీఐ కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న అమర్నాథ్‌రెడ్డి

మునిపల్లి(అందోల్‌): సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను తెలంగాణ సీసీఐ ఓఎస్డీ అమర్నాథ్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం మండలంలోని మేళసంగ్యం, కంకోల్‌ సీసీఐ కేంద్రాను తనిఖీ చేశారు. రైతులకు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను ఏఎంసీ చైర్మన్‌ సుధాకర్‌రెడ్డి అమర్నాథ్‌ దృష్టికి తీసుకెళ్లారు. పత్తి కొనుగోలులో బీబీఐ స్పెషల్‌ మోడ్‌ కొనసాగించాలని కోరారు. ముందుగా తెలంగాణ సీసీఐ ఓఎస్డీ అమర్నాథ్‌, వరంగల్‌ జీఎం అర్జున్‌ దావెలను శాలువ కప్పి చైర్మన్‌ సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌ మహేశ్‌, రాయికోడ్‌ మార్కెట్‌ కమిటీ ఇన్‌చార్జి సీఓ వరుణ్‌, రఘువీర్‌, తేజా, సంతోశ్‌, డి.కలీంపాషా, జిన్నింగ్‌ మిల్‌ యజమాన్యంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతుకు బేడీలు సరికాదు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

నారాయణఖేడ్‌: రిమాండ్‌లో ఉన్న లగచర్ల గిరిజన రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం సరికాదని గిరిజన నాయకులు అన్నారు. ఖేడ్‌ మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్‌, మాజీ సర్పంచ్‌లు రాజునాయక్‌, రవీందర్‌నాయక్‌, విఠల్‌రావు, సాయిలు, గిరిజన నాయకులు లక్ష్మణ్‌నాయక్‌, శంకర్‌ నాయక్‌, సర్దార్‌ నాయక్‌, వెంకట్‌, శ్రీనివాస్‌, రాందాస్‌ తదితరులు శుక్రవారం ఖేడ్‌ బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గిరిజనుల భూములు లాక్కోవడానికి యత్నించడమే కాకుండా అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టి అస్వస్థతకు గురైతే బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం దారుణమన్నారు. ఇలాంటి పనులు మానుకోకపోతే గిరిజనులు ప్రభుత్వంపై తిరగబడతారని హెచ్చరించారు.

ఓపెన్‌ స్కూల్‌ ఒక వరం

● జిల్లా కోఆర్డినేటర్‌ వెంకటస్వామి



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న వెంకటస్వామి తదితరులు

రాయికోడ్‌(అందోల్‌): మధ్యలోదువు ఆపేసిన వారికి ఓపెన్‌ స్కూల్‌ ఒక వరంలాంటిదని ఓపెన్‌ స్కూల్‌ జిల్లా కోఆర్డినేటర్‌ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పోస్టర్‌ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఓపెన్‌ స్కూల్‌లో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఓపెన్‌ స్కూల్‌ సర్టిఫికెట్లు రెగ్యులర్‌తో సమానం అని అన్నారు. స్కూల్‌లో చేరేందుకు ఈనెల 16వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రాయికోడ్‌ మండల విద్యాధికారి అంజయ్య, జెడ్పీహెచ్‌ఎస్‌ ఉపాధ్యాయులు ఖైరత్‌అలీ, ఓపెన్‌ స్కూల్‌ రాయికోడ్‌ అసిస్టెంట్‌ కోఆర్డినేటర్‌ కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ హైమావతి బాధ్యతల స్వీకరణ



పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యురాలు హైమావతి

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): న్యాల్‌కల్‌ పీహెచ్‌సీకి మరో వైద్యురాలు హైమామతి నియమితులయ్యారు. పీహెచ్‌సీలో అమృత్‌రాజ్‌, గణపతిరావు అనే ఇద్దరు వైద్యులు పని చేస్తున్నారు. జహీరాబాద్‌ ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌గా పని చేసిన వైద్యురాలు హైమావతి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం విధుల్లో చేరారు. వెంటనే ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, గర్భిణీలతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీలో స్త్రీ వైద్య నిపుణులు లేక పోవడం వల్ల మహిళలు ఇబ్బందులు పడేవారు, ఇక సమస్యలు తీరనున్నాయి. సమావేశంలో సూపర్‌ వైజర్‌ శ్యామలతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మెడల్స్‌, సర్టిఫికెట్లు తీసుకున్న విద్యార్థులతో డిప్యూటీ సివిల్‌ సర్జన్‌ సంగమణి

గత నవంబర్‌లో ఐఐటీ, జేఈఈ, నీట్‌ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన జీనియస్‌ విద్యార్థులకు పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటీ సివిల్‌ సర్జన్‌ సంగమణి మెడల్స్‌ అందజేశారు.

సదాశివపేట(సంగారెడ్డి):

హరీశ్‌రావును కలిసిన మాజీ జెడ్పీటీసీ



మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన స్వప్న

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును న్యాల్‌కల్‌ మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు స్వప్నకుమారి శుక్రవారం కలిశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని హరీశ్‌రావు ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరిస్తాం



వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్‌: రాతపూర్వకంగా ఇస్తే సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్‌ నాగేశ్వరావు అన్నారు. పటాన్‌చెరు విద్యుత్‌ డీఈఈ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన విద్యుత్‌ వినియోగదారులు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు తద్వారా అవకాశం కల్పించామని తెలిపారు. ఈ వేదికలో కొన్ని సమస్యలను విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంద్రేశంలో ఓల్టేజీ సమస్య కూడా విన్నించారు. అనంతరం విద్యుత్‌ టోల్‌ ఫ్రీ 1912 వాహనాన్ని అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఫైనాన్స్‌ సభ్యులు రామాంజనాయక్‌, డీఈఈ భాస్కర్‌రావు, ఏడీఈలు సంజీవ, దుర్గాప్రసాద్‌, నాగరాజు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కలెక్టర్‌కు నల్తూరు గ్రామస్తుల వినతి



జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం నల్తూరు గ్రామంలో క్రషర్‌ ఏర్పాటు అనుమతులను రద్దు చేయాలంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ వల్లూరు క్రాంతి, మైనింగ్‌ శాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఇటీవల ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డిని కలిసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన .. ఉన్నతాధికారులకు లేఖలు రాసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే లేఖను గ్రామస్తులు మైనింగ్‌ శాఖ అధికారులకు అందజేసి విజ్ఞప్తి చేశారు.

◆ క్రికెట్‌ టోర్నీ ఫైనల్స్‌కు రండి

పటాన్‌చెరు టౌన్‌: కేసీఆర్‌ క్రికెట్‌ ట్రోఫీ టోర్నీ ఫైనల్స్‌ ఆదివారం జరగనున్నాయని ఈకార్యక్రమానికి రావాలని మాజీ మంత్రి హరీశ్‌రావును ఆహ్వానించారు. మాజీ మంత్రిని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి నిర్వాహకులు ఐలాపూర్‌ మాణిక్యం కోరారు. అమీన్‌పూర్‌ పరిధిలో ఉన్న ఐలాపూర్‌ గ్రౌండ్స్‌లో ఈ పోటీ జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌, భారతీనగర్‌ కార్పొరేటర్‌ సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌ తొంట అంజయ్య, మున్సిపల్‌ చైర్మన్‌ బాల్‌రెడ్డి, శ్రీధర్‌ చారి తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా శ్రీనివాస్‌ గౌడ్‌ జన్మదినం



పటాన్‌చెరు: నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్‌ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో కాటా శ్రీనివాస్‌ గౌడ్‌ జన్మదినం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యకర్తలు రక్తదానం నిర్వహించారు. పదేళ్లు అధికారంలో లేని సమయంలో పార్టీకి అండగా ఉంటూ వచ్చాడన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్‌ గౌడ్‌, కౌన్సిలర్‌ శశిధర్‌ రెడ్డి మున్నా, శ్రీకాంత్‌ రెడ్డి, సుధాకర్‌ గౌడ్‌, చంద్రారెడ్డి, మహేశ్‌గౌడ్‌, నర్సింగరావు, శోభ, జయమ్మ, కాంగ్రెస్‌ కార్యకర్తలు, కాటా శ్రీనివాస్‌ అభిమానులు పాల్గొన్నారు.

◆ కృత్తికా నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి టౌన్‌ : వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కృత్తికా నక్షత్ర వేడుకలు శుక్రవారం నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్‌ తోపాజి అనంత కిషన్‌ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణ శివారు.. అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి లలిత సహస్ర పారాయణం చదివారు.

◆ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం పల్పనూర్‌ గ్రామంలో ఈనెల 15 వరకు నూతనంగా నిర్మించిన ఆలయంలో శివ పంచాయతీ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోపూజ, గణపతి పూజ పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ట, జలాధివాసం నిర్వహించారు. 14న శనివారం గణపతి పూజ పుణ్యాహవచనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

◆ పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మునిపల్లి(అందోల్‌): పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతోందని మాజీ ఎంపీపీ రాంరెడ్డి, రాయికోడ్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కంకోల్‌లో అర్హత కలిగిన వారి వివరాలు ఇందిరమ్మ సర్వే వివరాలు యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు సతీశ్‌ కుమార్‌ పాల్గొన్నారు.